సాక్షి
తూర్పుగోదావరి
బుధవారం । 23 । ఆగస్టు । 2023



టైం లేదు మాస్టారూ..
ఇన్‌స్పైర్ మానక్ ప్రాజెక్టుల నమోదుకు నెలాఖరుతో గడువు ముగుస్తుండగా.. ఉమ్మడి జిల్లాలో 602 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఉపాధ్యాయులు చొరవ చూపాలని అధికారులు కోరుతున్నారు.

II లో



సంప్రదాయ సాహిత్యం రూపు మాయదు
సంప్రదాయ సాహిత్యం రూపు మార్చుకుంటుందే తప్ప, రూపు మాయదని ఆచార్య బేతవోలు రామబ్రహ్మం అన్నారు.

మిగులు జలాల విడుదల


ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 3,86,926 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,800, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల చొప్పున నీరు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.10 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

పూర్తిస్థాయి ధాన్యం సేకరణే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ తేజ్ భరత్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఖరీఫ్ సీజన్లో జిల్లా పరిధిలో పండించే ధాన్యాన్ని పూర్తిస్థాయిలో సేకరించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ అన్నారు. ఆయన అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం జిల్లా స్థాయి సేకరణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ ఖరీఫ్‌లో 4,76,502 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనాకు రావడం జరిగిందన్నారు. స్థానిక అవసరాలకు 23,825 మెట్రిక్ టన్నులు అవసరమన్నారు. మిల్లర్ల ద్వారా 11,982, పౌర సరఫరాల సంస్థ ద్వారా 4,40,695 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అవకాశం ఉందన్నారు. గత మూడు సీజన్లలో గరిష్టంగా 2.84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేసినట్టు తెలిపారు. కస్టమైజ్డ్ మిల్లర్లు సరఫరా చేసే గన్నీ బ్యాగులకు అనుగుణంగా లక్ష్యాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల మేనేజర్ ఎ. కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి బి.విజయ భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు పాల్గొన్నారు.

జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం


దేవరపల్లిలో జూనియర్ కళాశాలల అధ్యాపకులతో కలిసి సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: ఎన్నికల వేళ ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసును ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దేవరపల్లి, గోపాలపురం మండలాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు మంగళవారం దేవరపల్లిలోని క్యాంపు కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యే తలారి వెంకట్రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంకట్రావుతో కలిసి వారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.

జలజీవన్ మిషన్ పనుల పరిశీలన


జలజీవన్ మిషన్ ప్రోగ్రెస్ పరిశీలిస్తున్న సెంట్రల్ టీం సభ్యులు

రాజానగరం: మండలంలో జలజీవన్ మిషన్ పనులను నేషనల్ జలజీవన్ మిషన్ సెంట్రల్ టీమ్ మంగళవారం పరిశీలించింది. రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ (వెస్ట్‌బెంగాల్) సౌమిత్ర సెంగుప్త, చీఫ్ ఇంజినీర్ (శ్రీనగర్) జి.ఎ.బేగ్ సభ్యులుగా ఉన్న ఈ టీమ్ పాలచర్ల, వెలుగుబంద, కానవరం, తోకాడ, రాజానగరంలలో పర్యటించింది., స్థానికులతో జలజీవన్ మిషన్ ప్రోగ్రెస్‌పై ఆరా తీసింది. వారి వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బాలశంకరరావు, డీఈ రవికుమార్, ఏఈ టివి సుబ్బారావులు ఉన్నారు. జిల్లాలో ఈ టీం 18 గ్రామాలలో పర్యటించనుంది. బుధవారం రాజమహేంద్రవరం రూరల్, సీతానగరం మండలాలలోను, గురువారం నిడదవోలు మండలంలోను పర్యటించనుంది.

నేడు జేఎన్‌టీయూకే వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం
బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీ 15వ వ్యవస్థాపక దినోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ఎల్.సుమలత మంగళవారం తెలిపారు. వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఉన్నత విద్యామండలి చైర్మన్ కే.హేమచంద్రారెడ్డి,మాజీ వీసీలు తులసీరామ్‌దాస్,వీఎస్ఎస్ కుమార్,ఎం.రామలింగరాజు హాజరవుతున్నారని పేర్కొన్నారు.గేట్,క్యాట్,క్రీడా విభాగాల్లో ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలతో పాటు 2021లో ఐఏఎస్ సాధించిన 2012-16 బ్యాచ్ విద్యార్థి యశ్వంత్‌కుమార్‌రెడ్డిను సత్కరిస్తున్నట్లు వివరించారు.

చందమామ అందే రోజు



అంతరిక్ష చరిత్రలో విప్లవం


చంద్రునిపై నేల, నీరు, సహజ వనరులు తదితర అంశాలపై లోతుగా శాస్త్రీయ ప్రయోగాలు, అధ్యయనం చంద్రయాన్-3 మిషన్ ప్రధాన ఉద్దేశం. రెండు గ్రహాల మధ్య యాత్రలు చేసేందుకు అవసరమైన కొత్త టెక్నాలజీ అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. దేశంలో పెరుగుతున్న సాంకేతిక సామర్థ్యాలకు ఇదో నిదర్శనం. చంద్రునిపై మానవ అవగాహన పెంపొందించడానికి చంద్రయాన్-3 విజయం తోడ్పడుతుంది. చంద్రుని దక్షిణ ధ్రువప్రాంతంలో వ్యోమనౌక సురక్షితంగా దిగి చరిత్ర సృష్టిస్తుందని యావత్ ప్రపంచం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది.

– డాక్టర్ ఎ.గోపాలకృష్ణ, డైరెక్టర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, జేఎన్‌టీయూకే

చందమామ రావే.. జాబిల్లి రావే.. కొండెక్కి రావే.. కోటిపూలు తేవే.. అని పాడుతూ.. ఆకాశంలోని చందమామను చూపిస్తూ.. ప్రతి అమ్మా తన బిడ్డకు గోరుముద్దలు తినిపిస్తుంది.

జాబిలితో చెప్పనా.. అంటూ ఓ ప్రియుడు తన ప్రియురాలిని ఉద్దేశిస్తూ డ్యూయెట్ పాడతాడు..

మామా.. చందమామా.. వినరావా నా కథ.. అంటూ ఒంటరిగా తన గుండెను చందమామ ముందు ఆవిష్కరిస్తుంటాడు ఓ భావుకుడు..

- చంద్రయాన్-3 విజయవంతం కావాలని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రజల ఆకాంక్ష
- ఈ అరుదైన ఘట్టం కోసం ఆసక్తిగా నిరీక్షణ
- నేటి సాయంత్రం చంద్రుని దక్షిణ ధ్రువంపై దిగనున్న విక్రమ్ ల్యాండర్

(డెస్క్-రాజమహేంద్రవరం): ఎవరెన్ని విధాలుగా చెప్పినా అందరికీ చందమామ ప్రియమైనదే. జాబిల్లిని చూడగానే గుండె నిండా తెలియని ఆనందం, అనుభూతి కలుగుతాయి. ఆకాశంలో ఉంటూ.. వెన్నెల కురిపిస్తూ.. అందరి మనసుల్లో అభిమానాన్ని సొంతం చేసుకుంటున్న ఈ చందమామ ఎవరు.. ఏమా కథ.. అక్కడెవరున్నారు.. గ్రహాంతవాసులున్నారా.. అక్కడ కూడా ఆకాశం ఉంటుందా.. గాలి.. నీరు ఉంటాయా.. ఉంటే మనం ఇల్లు కట్టుకోవచ్చా.. ఇలాంటి ఎన్నో సందేహాలు చాలా మందిని వెంటాడుతున్నాయి. సామాన్యులనే కాదు మన ఇస్రో శాస్త్రవేత్తల మదిని కూడా ఇలాంటి ప్రశ్నలు తొలిచేస్తున్నాయి. అందుకే చందమామ విశేషాల గుట్టును విప్పేందుకు వారందరూ అహరహం శ్రమించారు. దాని ఫలితమే చంద్రయాన్-3. అన్నీ సజావుగా సాగితే బుధవారం సాయంత్రం ఈ వ్యోమనౌక ఓ ఖగోళ అద్భుతాన్ని ఆవిష్కరించనుంది. అంతరిక్ష రంగంలో మన దేశాన్ని ముందు వరుసలో నిలపనుంది. ఆ క్షణాల కోసం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజానీకం ఒళ్లంతా కళ్లు చేసుకుని కోటి ఆశలతో ఎదురు చూస్తోంది.

అందరూ ఆసక్తిగా..
చంద్రుని దక్షిణ ధ్రువంపై పాదం మోపాలనే మన దేశం కలలు నెరవేరే క్షణాలు సమీపిస్తున్నాయి. చంద్రుని విశేషాలను ఆవిష్కరించే అరుదైన ఘట్టం చేరువవుతోంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) గత నెల 14న శ్రీహరికోటలో చేపట్టిన చంద్రయాన్-3 రాకెట్ ప్రయోగంలో రెండు దశలు ఇప్పటికే విజయవంతమయ్యాయి. మూడో దశలో భాగంగా చంద్రయాన్-3 లోని విక్రమ్ ల్యాండర్ జాబిల్లి దక్షిణ ధ్రువం వద్ద సురక్షితంగా ల్యాండ్ అయ్యే ఘట్టాన్ని ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించేందుకు జిల్లా యావత్తూ ఉత్కంఠతో నిరీక్షిస్తోంది. ఇప్పటికే కొన్ని దేశాలు చంద్రుడిపై రాకెట్ ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టినా దక్షిణ ధ్రువానికి చేరుకోలేదు. రష్యాకు చెందిన లూనార్-25ను ప్రయోగించినా చివరి దశలో విఫలమైంది. అన్నీ అనుకూలిస్తే నేటి సాయంత్రం 6.04 గంటలకు చందమామపై విక్రమ్ ల్యాండర్ దిగనున్నట్లు శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఇదే కనుక జరిగితే ప్రపంచంలోనే దక్షిణ ధ్రువానికి చేరిన తొలి దేశంగా భారత్ అంతరిక్ష చరిత్రలో నిలిచిపోనుంది.

చంద్రుడి విశేషాలు
- మన కాలమానం ప్రకారం చంద్రుడు తన చుట్టూ తాను తిరగడానికి 29.5 రోజులు పడుతుంది. చంద్రుడిపై ఒక్క రోజు భూమిపై దాదాపు ఒక నెలకు సమానం.
- చంద్రుడు భూమిని ఒక్కసారి చుట్టి రావడానికి 27.3 రోజులు పడుతుంది. భూమి - చంద్రుడు - సూర్యుడి మధ్య వ్యవస్థాపక మార్పుల వల్ల చంద్రమాసానికి 29.5 రోజులు పడుతుంది. దీనినే చాంద్రమాసం అంటారు.
- చంద్రుడు తన చుట్టూ తాను తిరగడానికి, భూమి చుట్టూ తిరగడానికీ ఒకే సమయం పడుతుంది. దీనివల్ల భూమిపై ఉన్న వారికి చంద్రుడి ఒకే ముఖం కనబడుతుంది. చంద్రుడి ఆవలి వైపు ఎప్పటికీ కనబడదు. దీనిని టైడల్ లాకింగ్ అంటారు.
- చంద్ర మండలంపై వాతావరణం లేదు. అందుకే చంద్రునిపై కాలు మోపిన మొదటి మానవుని పాదముద్రలు ఇప్పటికీ అలానే ఉన్నాయి.
- చంద్రుడి సాంద్రత భూమి సాంద్రతలో 1/6వ వంతు ఉంటుంది. అందువల్ల భూమిపై 60 కేజీల బరువు ఉండే మనిషి చంద్రునిపై 10 కేజీలు మాత్రమే ఉంటాడు.
- చంద్రుడి గరిష్ట ఉష్ణోగ్రత 127 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత –173 డిగ్రీల సెల్సియస్.
- 1959 సెప్టెంబర్ 14న రష్యా పంపిన లూనా - 2 చంద్రుడి మీదకు మొట్టమొదట దిగింది.
- ఇప్పటి దాకా వ్యోమగాములు 382 కిలోల చంద్ర శిలల్ని భూమి మీదకు తీసుకువచ్చారు.

దేశానికే గర్వకారణం


చంద్రయాన్ ప్రయోగ దేశానికే గర్వకారణం. ఈ స్ఫూర్తితో విద్యార్థులు అంతరిక్ష శాస్త్రంపై అభిరుచి పెంచుకుంటారు. దీనిని విద్యార్థులు వీక్షించేలా చేయాలని ప్రతి పాఠశాలకూ సమాచారమిచ్చాం. చంద్రుడి దక్షిణ ధ్రువంపై కాలు మోపిన నాలుగో దేశంగా భారత్ ఖ్యాతి సంపాదిస్తుంది. చంద్రయాన్ విజయవంతం కావాలని మనసారా కోరుకుంటున్నాను.

– జీవీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

ఎన్నో ఉపయోగాలు


చంద్రయాన్-3 ప్రయోగం భారతీయులంతా గర్వించదగినది. చంద్రుని పరిణామ క్రమం తెలుసుకుంటే భూమి ఏవిధంగా ఏర్పడిందో తెలిసే అవకాశం కూడా ఉంటుంది. భూమిపై ఉన్న వాతావరణం చంద్రునిపై ఎంత కాలంలో ఏర్పడే అవకాశముందో తెలుసుకోవడానికి, చంద్రునిపై రాళ్లు, మినరల్స్‌పై పరిశోధనకు, భూమి – చంద్రుని మధ్య వ్యత్యాసాలను, నైసర్గిక పరిస్థితులను అధ్యయనం చేయడానికి ఈ ప్రయోగం ఉపకరిస్తుంది.

– ప్రొఫెసర్ వై.శ్రీనివాసరావు, ఆదికవి నన్నయ యూనివర్సిటీ

సుపరిపాలన కోసమే సరళీకృత వ్యవస్థ

- జగన్ పాలనలో అందరికీ సంక్షేమ ఫలాలు
- క్షేత్రస్థాయిలో చురుకుగా అభివృద్ధి పనులు
- నిడదవోలు నియోజకవర్గ సమీక్షలో మంత్రి వేణు
- పాల్గొన్న ఎంపీ భరత్ రామ్, ఎమ్మెల్యే జీఎస్ నాయుడు, కలెక్టర్ మాధవీలత



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి వేణు, చిత్రంలో ఎంపీ భరత్ రామ్, ఎమ్మెల్యే శ్రీనివాస నాయుడు, కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రజలకు సుపరిపాలన అందించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరళీకృత వ్యవస్థ తీసుకుని రావడం, దాని ఫలాలు అందరికీ చేరేలా చర్యలు తీసుకుంటున్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ అన్నారు. కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో మంగళవారం నిడదవోలు నియోజకవర్గంపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీ మార్గాని భరత్ రామ్, నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడు, కలెక్టర్ మాధవీలత, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, నిడదవోలు మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చక్కటి వేదిక : మంత్రి వేణు
మంత్రి వేణు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఆలోచనకు అనుగుణంగా ప్రాధాన్యతా కార్యక్రమాల అమలు తీరుపై సమీక్షకు ఇది చక్కటి వేదిక అన్నారు. పరిపాలనా సంస్కరణలో భాగంగా ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు సచివాలయం, వలంటీర్ వ్యవస్థలను, రైతుల కోసం ఆర్బీకేలను తీసుకువచ్చామన్నారు. క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయడం కోసం ఇటువంటి సమీక్షలు ఉపయోగపడతాయన్నారు. ఆ మేరకు కార్యాచరణ నిర్దేశించుకుని పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: కలెక్టర్ మాధవీలత
కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ఆర్బీకే, సచివాలయం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలకు సంబంధించి, పనులు పూర్తి చేసిన వాటికి అనుగుణంగా చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. సచివాలయ భవన నిర్మాణ అంచనా రూ.40 లక్షల నుంచి రూ.43.60 లక్షలు, ఆర్బీకేలకు రూ.21.8 లక్షల నుంచి రూ.23.94 లక్షలు, హెల్త్ క్లినిక్‌లకు రూ.17.5 లక్షల నుంచి రూ.20.80 లక్షలకు పెరిగిందన్నారు. నియోజకవర్గంలోని 149 ప్రాధాన్యత భవనాల్లో 105 పూర్తి చేయగా, 50 భవనాలు అప్పగించామన్నారు. మిగిలిన 55 ఈ నెల చివరకు అప్పగిస్తామని తెలిపారు. మిగిలిన 44 భవనాలను సెప్టెంబర్ 15 నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. 91 స్కూళ్ల పరిధిలో 73 అదనపు తరగతి గదులు, 36 నాడు - నేడు పనులు, 146 కాంపౌండ్ వాల్ పనులు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. సెప్టెంబర్ చివరి నాటికి దాదాపు అన్ని పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. నియోజకవర్గంలోని 145 లేఅవుట్‌లలో 12,462 ఇళ్ల మంజూరు చేశామని, 5,664 ఇళ్లు పూర్తి చేశామన్నారు. మోర్త, విజ్జేశ్వరం, నిడదవోలు పరిధిలోని మూడు లేఅవుట్‌లలో అనుసంధాన రహదారి సమస్యపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలపై సమీక్ష చేస్తూ సీసీఆర్సీ కార్డుల లక్ష్యం 20 వేలకు గాను 16,511 మందికి జారీ చేశామన్నారు. క్రాప్ ఇన్సూరెన్స్ కింద 5,555 మంది రైతులకు చెందిన 7,210.5 ఎకరాల్లో రూ.2.57 కోట్ల క్లెయిమ్ పరిష్కారం చేశామన్నారు.

ప్రత్యేక దృష్టి సారించాలి : ఎంపీ భరత్ రామ్
ఎంపీ మార్గాని భరత్ రామ్ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయి సమావేశంలో చర్చించిన అంశాలపై అధికారులు ప్రత్యేక సారించి, ఆయా పనులను పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ జిల్లా స్థాయిలో పూర్తి చేసే వాటికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పెండింగ్ పనులపై దృష్టి : ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు
నిడదవోలు ఎమ్మెల్యే జి. శ్రీనివాస నాయుడు మాట్లాడుతూ నియోజక వర్గంలో ప్రాధాన్యత భవనాల నిర్మాణం, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసే క్రమంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఆ మేరకు ఏమైనా క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకుని రావాలన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీలకు అనుసంధాన రహదారి పనుల కోసం భూసేకరణ చేసే క్రమంలో స్థానికుల సహకారం అందించడానికి చొరవ తీసుకుంటానని చెప్పారు. సమావేశంలో సీపీవో ఏ.ముఖ లింగం పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధుల విడుదల

- ఉమ్మడి జిల్లాకు రూ.21 కోట్ల మంజూరు
- పల్లెల్లో మరింత వేగంగా ప్రగతి పనులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: గ్రామ పంచాయతీలకు శుభవార్త. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం మొదటి విడత నిధులు టైడ్, అన్ టైడ్ విభాగాల ద్వారా విడుదలయ్యాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు రూ.21.46 కోట్లు మంజూరయ్యాయి. దీంతో జిల్లా, మండల పరిషత్‌లలో సందడి నెలకొంది. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరాతో పాటు రోడ్లు, డ్రెయిన్ల వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయి. అత్యవసర అభివృద్ధి పనులకు వీటిని వెచ్చించేందుకు జిల్లా, మండల పరిషత్‌లు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి.

జిల్లా పరిషత్‌కు రూ.10.49 కోట్లు, ఉమ్మడి జిల్లాలోని 61 మండల పరిషత్‌లకు రూ.10.97 కోట్ల చొప్పున ఈ నిధులు మంజూరయ్యాయి. మండలాల వారీగా కాకినాడ రూరల్‌కు అత్యధికంగా రూ.38.63 లక్షలు, అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలానికి అత్యల్పంగా రూ.6.62 లక్షలు మంజూరు చేశారు. అన్ టైడ్ నిధులుగా (పారిశుధ్యం, నీటి సరఫరా, ఇతర అభివృద్ధి పనులకు) జిల్లా పరిషత్‌కు రూ.6.84 కోట్లు, మండల పరిషత్‌లకు రూ.6.73 కోట్లు మంజూరయ్యాయి. గత జూలైలోనే స్థానిక సంస్థల ఖాతాలకు ఈ నిధులు జమయ్యాయి. స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేయడం లేదని, వేరే అవసరాలకు పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించే ప్రతిపక్షాలకు ఈ నిధుల విడుదలతో చెక్ పెట్టినట్లయింది. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఆస్కారమేర్పడింది.

స్థానిక సంస్థలకు ఊపిరి


స్థానిక సంస్థల ఆర్థిక పరిపుష్టికి ఈ నిధులు దోహదం చేస్తాయి. పారిశుధ్యం నిర్వహణ, మంచినీటి పథకాల మరమ్మతులు, పైపులైన్ల విస్తరణను మండల, జిల్లా పరిషత్‌లు ఈ నిధులతో చేపట్టే వీలు కలుగుతోంది. ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయడం స్థానిక సంస్థలకు శుభపరిణామం.

– విప్పర్తి వేణుగోపాలరావు, జెడ్పీ చైర్మన్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా

అభివృద్ధికి తోడ్పాటు


ఆర్థిక సంఘం నిధులు గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునిస్తున్నాయి. తిమ్మాపురంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పంచాయతీ నిధులతో పాటు ఆర్థిక సంఘం నిధులను పారిశుధ్యం, తాగునీటి అభివృద్ధి పనులకు ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తున్నాం.

– బిజవాడ వీర వెంకట సత్యనారాయణ, సర్పంచ్, తిమ్మాపురం, కాకినాడ రూరల్

పంట నష్టం లెక్క తేలింది

- గోదావరి వరదకు 70.92 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం
- కూరగాయలు,అరటి రైతులకు ఎక్కువగా నష్టం
- బాధిత రైతులకు త్వరలో పరిహారం చెల్లింపు
- తుది జాబితాలు సిద్ధం చేసిన అధికారులు

కొవ్వూరు: జిల్లాలో గత నెలలో గోదావరి వరదలు లంక రైతులకు నష్టాన్ని కలిగించాయి. పెరవలి,కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లో 245 మంది రైతులకు చెందిన 70.925 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యాన శాఖ అధికారులు లెక్కలు తెల్చారు. ప్రధానంగా కూరగాయలు,అరటి పంటలకే అధికంగా నష్టం వాటిల్లింది. పెరవలి మండలంలో నష్ట తీవ్రత అధికంగా ఉంది. నెల రోజులు గడవక ముందే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి 33 శాతం కంటే అధికంగా నష్టపోయిన పంటల వివరాలను సేకరించారు. తుది జాబితాలను సిద్ధం చేశారు. గోదావరి నదీ తీరంలో లంకల్లో సాగు చేస్తున్న కూరగాయలు,అరటితో పాటు కనకాంబరం,బంతి,బొప్పాయి వంటి పంటలు ముంపునకు దెబ్బతిన్నట్లు అధికారులు నిర్ధారించారు. పంటలు రోజుల తరబడి వరద ముంపులో ఉండిపోవడం కుళ్లిపోయి దెబ్బతిన్నాయి. అరటి పంట హెక్టారుకు రూ.25వేలు చొప్పున,కూరగాయలు,బొప్పాయి,కనకాంబరం,బంతి పంటలకు రూ.15వేలు వంతున నష్ట పరిహారం అందించనున్నారు.

అరటి,కూరగాయ పంటలకే అధిక నష్టం
జిల్లా వ్యాప్తంగా అన్ని ఉద్యాన పంటలకూ కలిపి 70.925 హెక్టార్లలో నష్టం వాటిల్లితే వీటిలో కూరగాయపంటలు అత్యధికంగా 45.749 హెక్టార్లు,అరటి 23.910 హెక్టార్లు ఉంది. అలాగే కనకాంబరం 0.570,బంతి 0.296,బొప్పాయి 0.400 హెక్టార్లలోను పంట దెబ్బతిన్నట్లు గుర్తించారు.పెరవలి మండలంలో గరిష్టంగా 219 మంది రైతులకు చెందిన 53.07 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు నిర్ధారించారు. కొవ్వూరులో 19 మంది రైతులకు చెందిన 14.54 హెక్టార్లలోను, తాళ్లపూడి మండలంలో ఏడుగురు రైతులకు చెందిన 3.312 హెక్టార్లలోను పంట నష్టం వాటిల్లినట్లు లెక్క తెల్చారు. జిల్లా వ్యాప్తంగా దీనిలో 237 మంది సన్న,చిన్న కారుల రైతులు, ఎనిమిది మంది ఇతర రైతులున్నారు. బాధిత రైతులకు రూ.13.0297 లక్షలు పరిహారం కింద అందించనున్నారు.

జిల్లాలో ఉద్యాన పంటలు నష్టం(హెక్టార్లలో)

పంట	నష్టం	రైతుల సంఖ్య	పరిహారం (రూ.లక్షల్లో)
అరటి	23.910	64	5,97,750
కూరగాయలు	45.749	175	6,86,235
కనకాంబరం	0.570	03	8,550
బంతి	0.296	02	4,440
బొప్పాయి	0.400	01	6,000



పెరవలి మండలం కాకరపర్రులో వరద ముంపు బారిన పడిన అరటి పంట(ఫైల్)

పంట నష్టం జాబితాలు సిద్ధం


జిల్లాలో 245 మంది రైతులకు చెందిన 70.925 హెక్టార్లలో పంటలు గోదావరి వరదల కారణంగా దెబ్బతిన్నట్లు లెక్క తేలింది.పంట 33 శాతం కంటే అధికంగా దెబ్బతిన్న పంట వివరాలను నమోదు చేశాం. పెరవలి,కొవ్వూరు,తాళ్లపూడి మండలాల్లో నష్ట తీవ్రతను గుర్తించాం. కూరగాయలు,అరటి పంటలు వరద ముంపు కారణంగా దెబ్బతిన్నాయి.త్వరలోనే ఈ రైతులందరికి ప్రభుత్వం తరుపున పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటాం.ఇప్పటికే జాబితా కలెక్టర్ ఆమోదం పొందింది. నిధులు మంజూరు నిమిత్తం ప్రభుత్వానికి నివేదించాం.

–బి.సుజాత కుమారి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

క్లుప్తంగా

3 టన్నుల రేషన్ బియ్యం సీజ్



సీజ్ చేసిన రేషన్ బియ్యం వ్యాన్‌తో పోలీసులు

మామిడికుదురు: పాశర్లపూడి నుంచి ములికిపల్లికి అక్రమంగా తరలిస్తున్న ఆ టన్నుల రేషన్ బియ్యాన్ని నగరం ఎస్సై పి.సురేష్ మంగళవారం సీజ్ చేశారు. మొత్తం 66 బస్తాలతో వెళ్తున్న వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నామని, డ్రైవర్ తడాల నాగదుర్గారావు, వ్యాపారి పరంశెట్టి అర్జున్‌లను అరెస్టు చేశామని ఆయన తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని పౌర సరఫరాల అధికారులకు అప్పగించామని చెప్పారు. పాశర్లపూడిలో మద్యం తాగి వాహనం నడుపుతున్న ఇద్దరిని సోమవారం రాత్రి అరెస్టు చేసి, రెండు మోటార్ సైకిళ్లు సీజ్ చేశామని ఎస్సై తెలిపారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

అలమూరు: రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు ఇద్దరు చిన్నారులు ఎంపికయ్యారు. అమలాపురం లయన్స్ క్లబ్ వేదికగా మంగళవారం జిల్లా స్థాయి అండర్–15 చదరంగం పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఆలమూరుకు చెందిన గెద్దాడ దేవి అక్షయ (6వ తరగతి) ప్రథమ, పితాని సాయి లిఖిత (ఏడో తరగతి) నాలుగు స్థానాలు సాధించారు. దీంతో వీరిద్దరూ వచ్చే నెల 6, 7 తేదీల్లో అనంతపురం జిల్లా గుంతకల్లులో జరిగే రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలకు ఎంపికయ్యారని కోచ్ గుత్తుల రాంప్రసాద్ తెలిపారు.

3వ విడత ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మూడో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా అడ్మిషన్ల కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ మంగళవారం తెలిపారు. ఈ నెల 27లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, చేరదలచుకున్న ఐటీఐ పేరు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారు ప్రభుత్వ ఐటీఐలకు ఈ నెల 3న, ప్రైవేటు ఐటీఐలకు 31న హాజరు కావాలన్నారు. సందేహాలుంటే 0884 2348182 నంబరులో సంప్రదించాలని వర్మ తెలిపారు.

టైం లేదు మాస్టారూ..

- ఇన్‌స్పైర్ మానక్‌కు నెలాఖరు వరకే గడువు
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకూ 602 దరఖాస్తులే రాక

రాయవరం: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసి, భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఇన్‌స్పైర్ మానక్ (మిలియన్ మైండ్స్ ఆగ్మెంటింగ్ నేషనల్ యాస్పిరేషన్ అండ్ నాలెడ్జి) కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. 2009–10 విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా.. ఈ విద్యా సంవత్సరంలో కూడా ప్రాజెక్టుల రూపకల్పనకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారాలు చూపించే విధంగా ప్రాజెక్టులు రూపొందించాల్సి ఉంటుంది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 6 నుంచి 10వ తరగతి వరకూ చదువుకుంటున్న విద్యార్థులు.. సైన్స్ ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో ప్రాజెక్టులు తయారు చేయాలి. విద్యార్థులు రూపొందించిన

జిల్లాల వారీగా రిజిస్టర్ అయిన దరఖాస్తులు		
కోనసీమ	:	218
కాకినాడ	:	202
తూర్పు గోదావరి	:	182
మొత్తం	:	602



ప్రాజెక్టులను ఇన్‌స్పైర్ మానక్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని, పాఠశాల లాగిన్ ద్వారా నమోదు చేసుకోవాలి. నమోదుకు ఈ నెల 31తో గడువు ముగుస్తుండగా, సోమవారం సాయంత్రానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 602 దరఖాస్తులు మాత్రమే రిజిస్ట్రేషన్ కావడం గమనార్హం.

చొరవ చూపాల్సిందే..

ఈ సంఖ్యను పెంచే దిశగా సంబంధిత అధికారులు, సైన్స్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు చొరవ చూపించాల్సి ఉంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 74 ప్రాథమికోన్నత, 236 ప్రభుత్వ, 170 ప్రైవేటు ప్రాథమికోన్నత, 157 ప్రైవేటు ఉన్నత పాఠశాలలున్నాయి. దీని ప్రకారం జిల్లా నుంచి కనీసం 3 వేల నామినేషన్లు రిజిస్ట్రేషన్ కావాల్సి ఉంది. ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి కనీసం మూడు, ఉన్నత పాఠశాలల నుంచి ఐదు ప్రాజెక్టులు రూపొందించాలి. గత విద్యా సంవత్సరం 1,850 ప్రాజెక్టులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 62 ప్రాజెక్టులు మాత్రమే జిల్లా స్థాయి అవార్డుకు ఎంపికయ్యాయి. ప్రాజెక్టుల్లో సృజనాత్మకత, నాణ్యత లోపించడంతో జిల్లా స్థాయికి వెనుకబడ్డాయి. ఈసారి అలా కాకుండా అధిక సంఖ్యలో ప్రాజెక్టులు జిల్లా స్థాయికి ఎంపికయ్యేలా విద్యార్థులకు సైన్స్ ఉపాధ్యాయులు మార్గదర్శకత్వం చేయాల్సి ఉంది.

రూ.10 వేల పారితోషికం

సమాజం ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలకు పరిష్కారం చూపించే విధంగా విద్యార్థులు విన్నూత్న ఆలోచనలతో డ్రాఫ్ట్ రూపంలో ప్రాజెక్టును తీర్చిదిద్ది వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆయా అంశాలను నిర్వాహకులు పరిశీలించి, ప్రాజెక్టును ఎంపిక చేస్తారు. ఇలా ఎంపికైన ప్రాజెక్టుకు సంబంధిత విద్యార్థి బ్యాంకు ఖాతాకు రూ.10 వేలు నేరుగా జమ చేస్తారు. ఈ సొమ్ముతో సైన్స్ ఉపాధ్యాయుడి సహకారంతో విద్యార్థి పూర్తి ప్రాజెక్టును సిద్ధం చేయాలి. దానిని జిల్లా స్థాయి ప్రదర్శనకు తీసుకు రావాలి. జిల్లా స్థాయి ప్రదర్శనలో న్యాయనిర్ణేతలు ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు అనుమతిస్తారు. అక్కడ జాతీయ స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేస్తారు. జాతీయ స్థాయిలో ఎంపికైన ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శించడంతో పాటు, జపాన్‌లో జరిగే ప్రదర్శనకు పంపిస్తారు. జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టుకు పేటెంట్ లభించే అవకాశముంటుంది.

ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్ ఇలా..

డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఇన్‌స్పైర్‌అవార్డ్స్‌అండ్‌డిస్ట్రిక్ట్.

సైన్స్ ఉపాధ్యాయులు త్వరపడాలి



ఇన్‌స్పైర్ మానక్ పోటీల్లో విద్యార్థులు పాల్గొనేలా చైతన్యపరచాల్సిన బాధ్యత ఆయా పాఠశాలల్లోని సైన్స్ ఉపాధ్యాయులపై ఉంది. వారందరూ త్వరపడాలి. సమయం తక్కువగా ఉన్నందున జిల్లా నుంచి అధిక సంఖ్యలో నామినేషన్లు రిజిస్ట్రేషన్ అయ్యేలా చూడాలి. ఇన్నోవేషన్ పోటీల్లో పాల్గొని ప్రతిభ ప్రదర్శించేందుకు ఇది చక్కని అవకాశం.

– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి

వెబెక్స్ నిర్వహించాం

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులకు గత నెలలోనే వెబెక్స్ సమావేశం నిర్వహించాం. ఆయా పాఠశాలల నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో ప్రాజెక్టులు రూపకల్పన చేసే విధంగా సూచనలు చేశాం. సైన్స్ ఉపాధ్యాయులు వారి ప్రతిభను నిరూపించుకోవడానికి ఇదొక చక్కని అవకాశంగా భావించాలి. రాష్ట్ర స్థాయిలో పోటీ పడే విధంగా ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలి.

– జీవీఎస్ సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి

జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న పాఠశాలలు ఆ పాఠశాల లాగిన్ ద్వారా ఈ నెల 31వ తేదీ లోపు విద్యార్థుల ఆలోచనలకు అనుగుణంగా రూపొందించిన ప్రాజెక్టుల వివరాలు నమోదు చేయాలి.

పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యాన్ని 96401 88525 నంబర్‌లో సంప్రదించాలి.

విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన టీచర్ సస్పెన్షన్

కొత్తపేట: విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు ఆర్‌వీ సత్యనారాయణను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ మంగళవారం ఈ విషయం తెలిపారు. మండలంలోని వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పడాల చారిటబుల్ ట్రస్ట్, కృత ఫౌండేషన్లు ఈ నెల 7 నుంచి 3 రోజుల పాటు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. ఆ సందర్భంగా కంప్లైంట్ బాక్స్ ఏర్పాటు చేసి, విద్యార్థులు తమ సమస్యలను చిట్టీలపై రాసి, అందులో వేయాల్సిందిగా సూచించారు. ఈ నేపథ్యంలో ఇంగ్లిషు ఉపాధ్యాయుడు సత్యనారాయణ తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని పలువురు విద్యార్థినులు ఆ బాక్స్‌లో చిట్టీలు వేశారు. ఈ విషయాన్ని పడాల చారిటబుల్ ట్రస్ట్, కృత ఫౌండేషన్ల ప్రతినిధులు కలెక్టర్ హిమాన్షు శుక్లా దృష్టికి తీసుకువెళ్లారు. దీనిని కలెక్టర్ తీవ్రంగా పరిగణించారు. దీనిపై వెంటనే విచారణ జరపాల్సిందిగా కొత్తపేట తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబును ఆదేశించారు. విచారణ అనంతరం ఆయన ఇచ్చిన నివేదిక ఆధారంగా.. డీఈఓ ఆదేశాల మేరకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.చంద్రశేఖర్ ఈ నెల 17న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు 18వ తేదీన పోక్సో కేసు నమోదు చేశారు. విచారణలో విద్యార్థినులు చెప్పిన విషయాలను పరిగణనలోకి తీసుకున్న డీఈఓ కమలకుమారి శాఖా పరమైన చర్యల్లో భాగంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడు సత్యనారాయణను సస్పెండ్ చేశారు.

సంప్రదాయ సాహిత్యం రూపు మాయదు

- ఆచార్య బేతవోలు రామబ్రహ్మం
- రాఘవ పాండవీయం – పరిచయ గ్రంథావిష్కరణ
- పాల్గొన్న మల్లాప్రగడ సత్యశ్రీమన్నారాయణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య బేతవోలు, మల్లాప్రగడ సత్యశ్రీమన్నారాయణ తదితరులు

కాకినాడ కల్చరల్: సంప్రదాయ సాహిత్యం రూపు మార్చుకుంటుందే తప్ప, రూపు మాయదని ఆచార్య బేతవోలు రామబ్రహ్మం అన్నారు. పింగళి సూరన రచించిన 'రాఘవ పాండవీయం' ద్వ్యర్థి కావ్యానికి పద్యాల్లో సరళ వ్యాఖ్యానం చేస్తూ బాలాంత్రపు వెంకట రమణ రచించిన రాఘవ పాండవీయం – పరిచయ గ్రంథావిష్కరణ సోమవారం జరిగింది. స్థానిక విద్యుత్ నగర్‌లోని చల్లా జగన్నాథరావు కళావేదికలో ఆంధ్రీ కుటీరం ఆధ్వర్యాన ఈ సభ జరిగింది. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, మల్లాప్రగడ సత్యశ్రీమన్నారాయణ గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య బేతవోలు మాట్లాడుతూ, సంప్రదాయ సాహిత్యం కాలానుగుణంగా రూపు మార్చుకొంటోందని అన్నారు. ప్రస్తుత కాలంలో ప్రసంగాలు, వ్యాఖ్యానాలు, ఆడియోలుగా రూపు మార్చుకుందని చెప్పారు. మల్లాప్రగడ సత్యశ్రీమన్నారాయణ మాట్లాడుతూ, రామాయణ, మహాభారత అర్థాలను స్ఫురింపజేసే తొలి తెలుగు ద్వ్యర్థి కావ్యం రాఘవ పాండవీయమని తెలిపారు. ఈ కావ్యం పండితులకు తప్ప సామాన్యులకు అర్థం కాదని, అటువంటి గ్రంథాన్ని సరళ భాషలో అందరికీ అర్థమయ్యే రీతిలో రచించిన బాలాంత్రపు వెంకట రమణ ఆదర్శప్రాయుడని ప్రశంసించారు. తెలుగు సహాయ ఆచార్యులు డాక్టర్ సుంకర గోపాల్ గ్రంథ సమీక్ష చేశారు. రచయిత బాలాంత్రపు వెంకట రమణ మాట్లాడుతూ, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం బాటలో ఈ ప్రాచీన కావ్యాన్ని వివరణాత్మకంగా రచించానని చెప్పారు. బాలాంత్రపు సాహిత్య సేవలను రచయిత మార్ని జానకీరామ్ చౌదరి తదితర వక్తలు కొనియాడారు. అనంతరం రచయిత బాలాంత్రపు వెంకట రమణను ఆంధ్రీ కుటీరం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆంధ్రీ కుటీరం అధ్యక్షుడు మధునాపంతుల సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నగేష్‌బాబు, మధునామూర్తి, ఎం.చలపతి తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని డ్రైవర్ మృతి



కాకినాడ క్రైం: లారీ ప్రమాదంలో ఓ డ్రైవర్ ప్రాణాలు కోల్పోయాడు. వివరాలివీ.. దాసరి వీర వెంకట సత్యనారాయణ (67) కాకినాడ కొండబాబు కాలనీ రాజీవ్ గృహకల్ప అపార్టుమెంట్లలో నివాసం ఉంటున్నాడు. నగరంలోని కమర్షియల్ రోడ్డులో ఉన్న కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ పరిధిలో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. విధుల నిమిత్తం మంగళవారం ఇంటి నుంచి కార్యాలయానికి సైకిల్‌పై బయలుదేరాడు. కమర్షియల్ రోడ్డు వద్దకు చేరేసరికి డీ2 కరెంటు ఆఫీసు సమీపాన నడకుదురు నుంచి పోర్టుకు బియ్యం లోడుతో వెళ్తున్న ఓ లారీ సత్యనారాయణను ఢీకొట్టింది. కుప్పకూలిన అతడి తల పైకి లారీ ముందు చక్రం ఎక్కింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారకుడైన లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లారీని సీజ్ చేశారు. సత్యనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి కుమార్తె సెనగన వీర వెంకట పద్మావతి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

సాహిత్యంతో సమాజం జాగృతం

రాజానగరం: సమాజాన్ని సాహిత్యం జాగృతం చేస్తుందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. సాహిత్యంలో సత్తా చాటాలంటే ముందుగా భాషపై మంచి పట్టు ఉండాలని సూచించారు. వర్సిటీ క్యాంపస్‌లోని సెంట్రల్ లైబ్రరీలోని నన్నయ భారతి అధ్యయన కేంద్రంలో మంగళవారం జానపద దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శీలా వీర్రాజు బహూకరించిన నన్నయ చిత్రపటాన్ని, డాక్టర్ బలుసు వేంకట సత్యనారాయణమూర్తి రచించిన నన్నయ సహస్రాబ్ది గ్రంథాన్ని ఆచార్య పద్మరాజు ఆవిష్కరించారు. నన్నయ సహస్రాబ్ది గ్రంథంపై డాక్టర్ రెంటాల శ్రీవేంకటేశ్వరరావు సమీక్షించారు. రావూరి నరేష్ రచించిన నారసింహ పలుకు శతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వీసీ ఆచార్య పద్మరాజు మాట్లాడుతూ, వెయ్యేళ్ల నాటి ఆదికవి నన్నయను నేటికీ స్మరించడానికి తెలుగు భాష, సాహిత్యాలకు ఆయన చేసిన కృషే కారణమని అన్నారు. నేటి తరం విద్యార్థులు కూడా తెలుగు భాష, సాహిత్యాలపై పట్టు సాధించాలని సూచించారు. ఇందుకు అనువుగా వర్సిటీలో భాష, సాహిత్య సదస్సులు విరివిగా జరగాలని అన్నారు. సుమారు 15 వేల పుస్తకాలతో నన్నయ భారతిని నిర్వహిస్తున్న కో ఆర్డినేటర్ డాక్టర్ తలారి వాసు సేవలను ప్రశంసించారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.సుధాకర్ మాట్లాడుతూ, గోదావరి జిల్లా వాసిగా జానపద సాహిత్యాన్ని దగ్గరగా చూశానని చెప్పారు. జానపద గేయాలు కష్టాన్ని మరపించి, మనస్సును ఉల్లాసవంతం చేస్తాయని అన్నారు. అక్షర జ్ఞానంతో ఎంతటి ఉన్నత స్థాయికి చేరుకున్నప్పటికీ మూలాలను ఎప్పటికీ మరువరాదని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్, డాక్టర్ పి.వి జయనిర్మల, అసిస్టెంట్ లైబ్రేరియన్ డాక్టర్ టి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



నన్నయ సహస్రాబ్ది గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు తదితరులు

డీజిల్ అక్రమ రవాణా

- గుట్టు చప్పుడు కాకుండా యానాం నుంచి తరలింపు
- ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న డీజిల్ ట్యాంకర్

పిఠాపురం: కొంత కాలం నుంచి గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న డీజిల్ అక్రమ రవాణాను పిఠాపురం రూరల్ పోలీసులు రట్టు చేశారు. యానాం నుంచి అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ట్యాంకర్‌ను పిఠాపురం మండలం కుమారపురం రోడ్డు వద్ద మంగళవారం పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. కాకినాడ జిల్లాలో డీజిల్ ధర యానాం కంటే రూ.13 ఎక్కువగా ఉంది. దీంతో కొందరు వ్యాపారులు యానాం నుంచి ఎటువంటి రికార్డులూ లేకుండా పిఠాపురం పరిసర ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా డీజిల్ తరలించి విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై వచ్చిన సమాచారం మేరకు రూరల్ పోలీసులు మంగళవారం వలపన్నారు. యానాం నుంచి అక్రమంగా వచ్చిన డీజిల్ ట్యాంకర్‌ను పట్టుకుని, స్టేషన్‌కు తరలించారు. ట్యాంకర్‌లో 3,600 లీటర్లకు పైగా డీజిల్ ఉందని చెబుతున్నారు. డీజిల్ అక్రమ తరలింపుపై పౌర సరఫరాల అధికారులకు సమాచారం అందించారు. సంబంధిత అధికారులు డీజిల్ ట్యాంకర్‌ను పరిశీలించారు. ట్యాంకర్‌కు చెందిన వ్యక్తులు తాము యానాంలో డీజిల్ కొన్నామని చెబుతూ పోలీసులకు బిల్లులు అందజేశారు. ఆ బిల్లులో ట్యాంకర్ నంబర్ లేకపోవడంతో పాటు కొన్ని సెకన్ల వ్యవధిలోనే వేల లీటర్ల డీజిల్ కొన్నట్టు చూపించారు. దీనిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారం కొన్ని నెలలుగా ప్రతి రోజూ జరుగుతున్నట్టు తెలుస్తోంది. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు.

టైర్ల నుంచి చెలరేగిన మంటలు

- ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ అప్రమత్తం
- త్రుటిలో తప్పిన పెద్ద ప్రమాదం



అగ్ని ప్రమాదానికి గురైన ఆయిల్ ట్యాంకర్

తొండంగి: ఆయిల్ ట్యాంకర్ టైర్ల నుంచి మంటలు వ్యాపించిన సంఘటనలో డ్రైవర్ అప్రమత్తతతో త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. విశాఖపట్నం నుంచి భద్రాచలం వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ 16వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున తొండంగి మండలం గోపాలపట్నం చేరుకుంది. అక్కడ అకస్మాత్తుగా ట్యాంకర్ టైర్ల నుంచి మంటలు ఒక్కసారిగా ఎగిశాయి. ట్యాంకర్ ఇతర భాగాలకు సైతం మంటలు వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన ట్యాంకర్ డ్రైవర్ 100, 101కు ఫోన్ చేశాడు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనపై తొండంగి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అన్నవరం పోలీసులు చర్యలు తీసుకున్నారు. వాహనాలను అన్నవరం గ్రామం మీదుగా మళ్లించారు.

పీహెచ్‌సీ డాక్టర్‌పై ఫిర్యాదు



డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు చేస్తున్న రంగంపేట ప్రజాప్రతినిధులు, నాయకులు

రంగంపేట: స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు డి.లావణ్యను, ఆమెకు సహకరించిన పీహెచ్‌ఎన్ గంగాభవానీని తక్షణమే సస్పెండ్ చేయాలని మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) కె.వెంకటేశ్వరరావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల సమావేశం సందర్భంగా వైద్య శాఖ వివరాలు అడిగిన జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, మండల పరిషత్ విప్ సుంకర అప్పారావు, ప్రజాప్రతినిధులపై డాక్టర్ లావణ్య కుటుంబ సభ్యులు, అనుచరులు దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ సంఘటనపై వెంటనే విచారణ జరిపించాలని, డాక్టర్ లావణ్యను, పీహెచ్‌ఎన్ గంగాభవానీని సస్పెండ్ చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇర్రాయేలు, మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, 16 గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కలెక్టర్, డీఎంహెచ్‌ఓలకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, గురువారంలోగా చర్యలు తీసుకోకపోతే రంగంపేట పీహెచ్‌సీ ఎదుట ధర్నా, నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు.

స్పోర్ట్స్ మీట్‌లో సత్తా చాటిన కేవీ విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: రీజినల్ స్పోర్ట్స్ మీట్‌లో రాజమహేంద్రవరం ఓఎన్‌జీసీ అసెట్‌లోని కేంద్రీయ విద్యాలయ (కేవీ) విద్యార్థులు సత్తా చాటారు. హైదరాబాద్‌లో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకూ ఈ స్పోర్ట్స్ మీట్ జరిగింది. అండర్–17 బాలుర క్రికెట్ ఫైనల్స్‌లో మల్కాపురం కేవీ జట్టును రాజమహేంద్రవరం కేవీ జట్టు ఓడించి విజేతగా నిలిచింది. అండర్–14 బాలురు, బాలికల జట్లు హ్యాండ్‌బాల్ పోటీల్లో రన్నర్స్‌గా నిలిచాయి. రాజమహేంద్రవరం కేవీ క్రికెట్ జట్టు నుంచి గౌతమ్ సత్యం, ఎం.పవన్‌కుమార్, మార్గాని లోకేష్, టి.దుర్గాప్రసాదరావులు సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో జరిగే కేంద్రీయ విద్యాల నేషనల్ స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికయ్యారు. విజేతలను ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం అసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్ నారాయణ్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 కేంద్రీయ విద్యాలయాలున్న హైదరాబాద్ రీజియన్‌లో రాజమహేంద్రవరం కేవీ ఓఎన్‌జీసీ స్కూల్ ఛాంపియన్‌గా నిలవడం గర్వంగా ఉందన్నారు. క్రీడాకారులను, శిక్షణ ఇచ్చిన ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ మధుసూదనరెడ్డి, హ్యాండ్ బాల్ కోచ్ రాధికను అభినందించారు. క్రీడల్లో రాణించేందుకు సహకరిస్తున్న ఓఎన్‌జీసీ అసెట్ మేనేజర్ అమిత్ నారాయణ్, యాజమాన్యానికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాబూజీ కృతజ్ఞతలు తెలిపారు.



ప్రతిభ చూపిన కేవీ క్రీడాకారులతో ఓఎన్‌జీసీ అసెట్ ఈడీ అమిత్ నారాయణ్

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: గుర్తు తెలియని వ్యక్తి (35) ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బొమ్మూరు గ్రామం మురళీకొండ వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మురళీకొండ 220 కేవీ సబ్‌స్టేషన్ సమీపాన ప్రణతి హెయిర్‌స్టైల్ షాపు ముందున్న షెడ్డుకు ఉన్న రాడ్‌కు ఆ వ్యక్తి టవల్‌తో ఉరి వేసుకున్నాడు.

మృతదేహంపై జీన్స్ ప్యాంట్, టీషర్టు ఉన్నాయి. షాపు యజమాని ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌కు 0883–2434173 నంబర్‌లో తెలియజేయాలని ఎస్సై కోరారు.



వ్యక్తి మృతదేహం